


ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు

షాద్‌నగర్ రూరల్, జూలై 23: దివ్యాంగులను కించపర్చేలా ట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లాఅధ్యక్షుడు అశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్యాంగులను కించపరిచేలా స్మితా సబర్వాల్ జూలై 21న ట్వీట్ చేస్తూ.. 'అంధుడిని కారు డ్రైవర్‌గా నియమిస్తామా? వైకల్యం ఉన్న వైద్యుడితో శస్త్ర చికిత్స చేయించుకుంటామా?' అని పేర్కొన్నారని తెలిపారు. దిగజారి ట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారి వెంటనే దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలోని ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదని, కొత్త రైళ్లకు నిధులు కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు మాత్రం కొంత అనుకూలంగా కొంత వ్యతిరేకంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎంతో కొంత ప్రాధాన్యత లభిస్తుందన్న ప్రజల ఆశలు ఈ బడ్జెట్‌తో అడియాశలే అయ్యాయి. మొత్తంగా కేంద్ర బడ్జెట్ కొందరికి ఖేదం.. కొందరికి మోదం అన్న తీరులో ఉందన్న చర్చ సాగుతోంది.



వేతన జీవులకు కొంత ఊరట

ఆదాయ పన్ను విషయానికి వస్తే ఈసారి కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్‌లో వేతన జీవులకు కొంత ఊరట కలిగించారు. ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్న ఉద్యోగులు ఏడాదికి రెండు నెలల వేతనం ఆదాయం పన్ను కింద ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తున్న విషయం తెలిసిందే. ఆదాయ పన్ను చెల్లింపుల్లో కొత్త విధానం అనుసరించే ఉద్యోగులకు స్వల్ప ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకుంది. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్నూ విధించలేదు. రూ.3 లక్షల నుంచి రూ.7లక్షల వరకు 5శాతం పన్ను విధించగా, రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల లోపు 10శాతం, రూ.10లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షలకు పైబడిన ఆదాయానికి 30శాతం పన్ను విధించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కొత్త పన్ను విధానం వల్ల రూ.17,500 పన్ను ఆదా కానున్నట్లు తెలిపింది. కాగా, పాత పన్ను విధానంలో కొనసాగుతున్న ఉద్యోగుల పన్ను చెల్లింపుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. అయితే, పన్ను చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. ఆదాయ పన్ను చెల్లింపుల నుంచి తమకు ఊరట కలిగేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ఉంటుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది.



- వేతన జీవులకు అంతంతే!
- కృష్ణ రైల్వేలైన్ ఊసే లేదు
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తావనేదీ
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

విద్య, ఉపాధి, నైపుణ్య రంగాలకు ప్రాధాన్యం

కేంద్ర బడ్జెట్‌పై సాధారణ మధ్య తరగతి వర్గాలతో పాటు వేతనజీవులు, రైతులు, వ్యాపారులు, నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారి ఆశలకనుగుణంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించే ప్రధానమంత్రి అన్న యోజన పథకాన్ని మరో అయిదేళ్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు కొంత ఊరట కలగనుంది. అదేవిధంగా పప్పు ధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి పెంచడానికి వీలుగా చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. యువత కోసం కేంద్రం అయిదు ప్రత్యేక పథకాలు ప్రకటించింది. విద్య, ఉపాధి, నైపుణ్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలియజేసింది. ప్రధానమంత్రి ప్యాకేజీలో భాగంగా మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. కొత్త ఉద్యోగాల కల్పనలో భాగంగా తొలి నెల వేతనం కేంద్ర ప్రభుత్వమే చెల్లించనున్నట్లు తెలిపింది. ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ, ఎంఎస్ఎంఈపై దృష్టి సారించింది. ఉన్నత విద్య చదివే విద్యార్థులకు రూ. 10 లక్షల రుణం ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల విద్యార్థి వర్గాల నుంచి సానుకూల స్పందన లభించింది. బంగారం ధరలు తగ్గేలా, పేదల సొంతింటి కల సాకారం చేసే విధంగా తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ పథకాలు ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు కొంత తోడ్పాటునందించనున్నాయి.



ప్రాజెక్టులకు మొండిచేయి



పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో విజ్ఞప్తి చేసింది. లేదంటే ప్రత్యేక నిధులైన ఇవ్వాలని కోరింది. అయితే, ఈ కోరికను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లోనే పూర్తిగా నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్‌కు నిధులు ఇవ్వాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

రంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ జిల్లా ప్రజలకు మళ్లీ నిరాశే మిగిల్చింది. రైతులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు కొంత ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోగా, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనా రంగాలకు పెద్దపీట వేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి ఏమాత్రం ప్రస్తావించకపోవడం జిల్లా ప్రజలను నిరాశ పరిచింది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గతంలో ఇచ్చిన హామీలపై ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

కూత పెట్టని రైళ్లు



దశాబ్ధాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. వికారాబాద్ - పరిగి - రాయచూర్ - కృష్ణ మార్గంలో కొత్తగా రైల్వేలైన్ కోసం సర్వే పనులు కొనసాగుతుండగా, నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదు. లింగంపల్లి వరకు నడపిస్తున్న ఎంఎంటీఎస్ రైళ్లను వికారాబాద్ వరకు నడిపించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా ఎంఎంటీఎస్ రైళ్లను వికారాబాద్ వరకు పొడిగించే ప్రస్తావన వస్తుందని ఆశించిన వికారాబాద్ జిల్లా కేంద్రం ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది.



తెలంగాణకు మొండి చేయి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపింది. ప్రధాని మోదీ తన కుర్చీని కాపాడుకునేందుకే ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లుంది. తెలంగాణ నుంచి ప్రజలు బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే రాష్ట్రానికి బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చింది. రాష్ట్రానికి నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలి.

- పి.రఘువీరారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ధారూరు

పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా ఉంది



ఉపాధి, నైపుణ్య శిక్షణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. యువతకు ఉపాధి, నైపుణ్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయంలో ఉత్పాదక, స్థితి స్థాపనకత, పట్టణాభివృద్ధి, తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది.

- బొక్కనర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో వివక్ష చూపారు



కేంద్రం వెలువరించిన బడ్జెట్ ప్రజామోద్య యోగ్యంగా లేదు. బడ్జెట్ పట్ల వివక్ష చూపారు. తెలంగాణ అనే పదాన్ని కూడా ఉచ్చరించలేదు. తెలంగాణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కోరినా బడ్జెట్‌లో కేటాయించలేదు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు ఏ రంగానికి కూడా నిధులు కేటాయింపు జరగలేదు. పాలమూరు ప్రాజెక్టు, మెట్రో విస్తరణకు నిధులు కేటాయించాలి. ఉద్యోగ కల్పన, నైపుణ్యత మధ్య తరగతి రంగాలకు ప్రాధాన్యత కల్పించలేదు.

- చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు

తెలంగాణకు తీవ్ర అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 సీట్లు ఇచ్చినా కనీసం ఎనిమిది రూపాయలు కూడ కేటాయించలేదు. కేంద్రం తెలంగాణను చిన్నచూపు చూసింది. కొత్త పన్నుల విధానంలో వారికి మాత్రమే రాయితీలు ప్రకటించడం ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర ఆగ్రహావేశాలకు గురి చేసే విధంగా ఉంది.

పాలమాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ



సీపీఎస్ విధానంలో మార్పు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తు మాట కూడా బడ్జెట్లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశ కలిగించింది. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రస్తుతం3.25 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. వచ్చే ఐదేళ్లలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెప్పింది. కానీ గడిచిన 10 ఏళ్లలో ఎన్ని కోట్ల ఉద్యోగాలు సృష్టించిందో కనీస ప్రస్తావన కూడా చేయలేకపోయింది. పాత పెన్షన్‌పై ఒక స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. పాత పనుల విధానంలో రూపాయలు ఏడు లక్షల వరకు ఎలాంటి పన్ను లేకుండా మినాయింపు ఇచ్చే విధంగా పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలి.

- కె. గోపాల్‌నాయక్, టీఎస్ యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ప్రార్థనా మందిరం కూల్చివేతపై వివాదం

- ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు
- నచ్చజెప్పిన డీసీపీ
- కూల్చివేసిన ప్రదేశంలోనే షెడ్డు నిర్మాణం.. ప్రార్థనల నిర్వహణ



మందిరం కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మొయినాబాద్ రూరల్, జూలై 23: సుమారు మూడు వందల ఏళ్ల నాటి ఓ ప్రార్థనా మందిరాన్ని కూల్చివేయడం కలకలం రేపింది. ఈ ఘటన మొయినాబాద్ మండలం చిలుకూరు పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చిలుకూరులో సర్వే నంబర్ 134లో ఓ ఎన్నారైకి 15.34ఎకరాల పట్టా భూమి ఉంది. దానికి ఆనుకొని సర్వే నంబర్ 133లో వక్ఫ్ బోర్డుకు ఉన్న నాలుగు గుంటల భూమిలో ఓ ప్రార్థన మందిరం సుమారు మూడు వందల ఏళ్ల నుంచి ఉంది. ఇటీవల ఎన్నారై భూమిని చదునుచేస్తూ ప్రార్థన మందిరాన్ని కూల్చారు. దీంతో చిలుకూరు గ్రామస్తులు, వక్ఫ్‌బోర్డుకు, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రార్థన మందిర భూమిని కాపాడాలని ఓ వర్గం ప్రజలు పోలీస్ స్టేషన్ వచ్చి ఆందోళన చేశారు. విషయం తెలిసి ఎమ్మెల్సీ రెహమత్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, మత పెద్దలు మాట్లాడుతూ.. ప్రార్థన మందిరాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత మసీదు ఉన్న స్థలంలో ప్రార్థనలను నిర్వహించారు. విషయం తెలిసి రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకొని అల్లర్లు జరక్కుండా పరిస్థితిని సమీక్షించారు. ప్రార్థన మందిరాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంగళవారం ఉదయం అదే స్థలంలో తాత్కాలిక షెడ్డు వేసి ప్రార్థనలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీనిపై మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను స్పందిస్తూ.. సర్వే నంబర్ 133లో వక్ఫ్ బోర్డుకు చెందిన నాలుగు గుంటల స్థలంలో ప్రార్థన మందిరం మూడు వందల ఏళ్ల నుంచి ఉన్నట్టు రికార్డులున్నాయని, మందిరాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఈ నాలుగు గుంటల భూమికి ఎలాంటి దారి లేదని కూడా తహసీల్దార్ చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుతామన్నారు. స్థలం వద్దకు వెళ్లిన వారిలో చేవెళ్ల ఏసీపీ కిషన్, ఎస్సై నర్సింహ, పోలీసు సిబ్బంది ఉన్నారు.



పిరంగి కాలువకు గండి పడటంతో పొలంతో పేరుకు పోయిన ఇసుక

పిరంగి కాలువకు గండి

- ఇసుక మేటతో నిండిన పొలాలు
- లబోదిబోమంటున్న రైతులు

శంకర్‌పల్లి, జులై23: నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మోకిలలో పిరంగి కాలువకు గండి పడింది. దీంతో రైతుల పొలాల్లో ఇసుక మేట వేసింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెండు నెలల క్రితం పిరంగి కాలువలో పూడికతీత చేపట్టిన అధికారులు అసంపూర్తిగా పనులు వదిలేశారు. దీంతో మూడు నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కాలువకు భారీ వరద వచ్చింది. దీంతో పిరంగి కాలువకు గండిపడి వరదనీరు రైతుల పొలాల్లోకి చేరింది. వరదతో పాటు ఇసుక కొట్టుకువచ్చి పెద్ద ఎత్తున మేట వేసింది. దీంతో పాటు డ్రైనేజి నీరు పొలాల్లో నిండి పోయింది. వేల రూపాయలు ఖర్చు చేసి వరి నాటేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటే పిరంగి కాలువ తెగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. కాలువను సర్వే చేయకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల డబ్బుతో పిరంగి కాలువలో పూడికతీత పనులు చేశారని రైతులు ఆరోపించారు. పిరంగి కాలువకు ఏర్పడిన గండిని వెంటనే పూడ్చాలని రైతులు డిమాండు చేశారు. అయితే, ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ రాధికను వివరణ కోరగా కాలువ పూడిక తీత పనులు చేసేటప్పుడు రైతు తన పొలం వద్ద కాలువకు మట్టి పోయనీయలేదని తెలిపారు. అందుకే కాలువకు గండి పడిందని చెప్పారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే పూడికతీత



రియల్ ఎస్టేట్ వ్యాపారుల వెంచర్ల వద్ద మురికినీరు నిలువ ఉండకూడదని వారి డబ్బులతోనే అధికారులు పనులు చేపట్టారు. మాకు కనీసం సమచారం ఇవ్వకుండా కాలువను సర్వే చేయకుండా పనులు చేశారు. పనులు మధ్యలోనే వదిలేయడంతో కాలువకు గండి పడింది. దీంతో పంట పొలాలు వరదతో కొట్టుకు పొయాయి.

- మోత్కుపల్లి మల్లేషం, రైతు, మోకిల



పిరంగి కాలువకు పడిన గండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 23 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై ఆర్డీఓలు, తహసీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన వాటిని తొందరగా పరిష్కరించాలని ఆర్డీఓలకు, తహసీల్దార్లకు సూచించారు. రోజువారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆగష్టు 15వ తేదీలోపు పూర్తి స్థాయిలో పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. యాచారం, కందుకూరు, చేవెళ్ల, మొయినాబాద్, మంచాల్, మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరామ్, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనానికి మాజీ రాష్ట్రపతి

గురూజీ జయంతి వారోత్సవాల్లో రామ్‌నాథ్ కోవింద్

నందిగామ/శంషాబాద్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురువు చారీజీ మహరాజ్ 97వ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొన్నారు. నందిగామ మండలంలోని కన్హాశాంతివనంలో ఈ నెల 25 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురూజీ కమలేష్ పటేల్‌తో కలసి ధ్యానం చేశారు. మాజీ రాష్ట్రపతి కన్హాశాంతివనంలో మూడు రోజులు ఉంటారని సమాచారం. కాగా అంతకు ముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు. కన్హాశాంతి వనానికి వెళ్లేందుకు మధ్యాహ్నం 1.45 ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో ఆయన నందిగామకు వెళ్లారు.



శాంతివనంలో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



హాజరైన భక్తులు

రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఫిర్యాదు చేయాలి

కులకచర్ల, జూలై 23: మొదటి విడతగా రూ.లక్ష రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలకు, నేరుగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏవో వీరస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకుల్లో ఇబ్బందులు కలగకుండా గ్రామాల వారీగా బ్యాంకర్లతో చర్చించి త్వరలో తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. రుణమాఫీ కాలేదని రైతులు ఫిర్యాదు చేశారని, వారి వివరాలను పరిశీలిస్తున్నామని వివరించారు.

నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలి


మోత్కూర్ రైసుమిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దోమ, జూలై 23: రైతుల దగ్గర సేకరించిన బియ్యాన్ని నూర్పిడి చేసి నాణ్యతతో ప్రభుత్వానికి అందించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర రైసుమిల్లు యజమానులకు సూచించారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలోని మహాలక్ష్మీ రైసుమిల్లును మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైసుమిల్లు యజమాని శ్రీధర్ రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ

మీసేవా కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు

మర్పల్లి, జూలై 23: మీ సేవాకేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేసినా, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు డబ్బులు అధికంగా వసూలు చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె నవాబుపేట ఎంపీడీవో అనురాధతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి మీ సేవ దగ్గర ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తే నిర్వాహకులు ఎలా ప్రవర్తిస్తున్నారని, రశీదులో వచ్చే రుసుం కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ఏ మీసేవా కేంద్రంలోనైనా అధిక వసూలు చేస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మర్పల్లి ఎంపీడీవో రాజమల్లయ్య, ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఉన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపట్టిన 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్లో ఉన్న విలువ ప్రకారం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రాష్ట్రంలో 165కిలోమీటర్ల మేర నిర్మించనున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ కోసం రైతులు మూడు వేల ఎకరాల భూములను కోల్పోతున్నారని తెలిపారు.జిల్లాలో మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, వికారాబాద్, పూడూరు మండలాల మీదుగా కొనసాగనున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్, టవర్ల నిర్మాణంలో రైతులు ఒక్కో టవర్‌కు 12 గుంటలు, ఎలక్ట్రిక్ లైన్‌కు 12 గుంటల మేర భూములు కోల్పోనున్నారని వివరించారు. రైతులు కోల్పోయే భూముల విలువ మార్కెట్ విలువ కోటి నుంచి మూడు కోట్ల వరకు ఉందని తెలిపారు. ఈ విలువ ప్రకారం సరైన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

కొత్త పట్టాదారులకు రైతుబీమా

ఆగస్టు 5లోగా దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్, జూలై 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతుబీమా పథకం కొనసాగింపునకు కాంగ్రెస్ సర్కార్ సంసిద్ధమైంది. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు, గతంలో బీమా పథకంలో ఉండి నామినీ చనిపోయిన వారు, ఆధార్‌కార్డులో తప్పులున్న వారు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గ్రామాల వారీగా నిర్ధేశిత గడువులోగా కొత్త పట్టాలు పొందిన వారి జాబితాను ప్రకటించింది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను సంబంధిత వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులకు ఇచ్చారు. వారి సమక్షంలో రైతు దరఖాస్తుపై సంతకం చేయాలి.

జూన్ 28 లోపు పట్టాలుంటేనే

కొత్తగా పట్టాలు పొందిన వారు ఇదివరకు బీమా పథకంలో లేకుంటే ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పట్టా జూన్ 28వ తేదీ లోగా పట్టా జూన్ 28వ తేదీలోగా రిజిస్టర్ అయి ఉండాలి. బీమా పరిధిలోకి రావాలంటే ఆగస్టు 14, 1965 నుంచి ఆగస్టు 14, 2006 మధ్య పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎల్ఐసీ బీమా నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డులో 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన రైతులు దీనిని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

రుణమాఫీని ఓర్వలేకనే చౌకబారు మాటలు



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రైతుల రుణమాఫీని చూసి ఓర్వలేకనే శాసనసభలో బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండిపడ్డారు. మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశాల అనంతరం ఆయన మీడియా ఆవరణలో మాట్లాడుతూ.. శాసనసభలో బీజేపీ నేతలు చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దక్షిణ భారతదేశ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారో తెలపాలని డిమాండ్ చేశారు. రుణమాఫీలో నోడల్ ఏజెన్సీల తప్పిదాల వల్లే కొందరికి రుణమాఫీ డబ్బులు జమ కాలేదన్నారు. ప్రభుత్వం రూపొందించిన గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతీ రైతు ఖాతాలో డబ్బు జమ చేశామన్నారు. రుణమాఫీకి నిధుల కొరత లేదని, ఏదో ఒకటి మాట్లాడాన్న ఉద్దేశంతోనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయన్నారు. తమ నియోజకవర్గంలో ఒక్క బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు మాత్రమే రుణమాఫీ విషయంలో తప్పిదాలు చేశారని తెలిపారు. వేరే చోట్ల మాఫీ సాఫీగా జరిగిందన్నారు.

పౌరాణికాలను ప్రోత్సహించాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న బండారి రమేష్

షాద్‌నగర్, జూలై 23: అంతరించిపోతున్న పౌరాణిక నాటకాలను ప్రోత్సహించాలని ప్రముఖ వ్యాపారవేత్త, విశ్వహిందూ పరిషత్ అగ్రనాయకులు, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారు రమేష్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సంస్థ నిర్వహించే నాటకాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సినిమాల రాకతో పౌరాణిక నాటకాలు ఆదరణ కోల్పోయాయన్నారు. ప్రజలకు గుణాత్మక సందేశాలిచ్చే పౌరాణిక నాటకాలు, కళాకారులను ఆదుకోవాలన్నారు.

వన మహోత్సవం లక్ష్యం పూర్తికి చొరవ తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో శ్రీలత

తలకొండపల్లి, జూలై 23 : వన మహోత్సవం నిర్ణీత లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ తీసుకోవాలని డీఆర్డీవో శ్రీలత అన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో కనీసం 6వేల మొక్కలు నాటాలని సూచించారు. తలకొండపల్లి మండలంలో మంగళవారం ఆమెతో పాటు డీఆర్‌డీవో ఏపీడీ సుభాషిణి, అడిషినల్ పీడీ సక్రియతో కలిసి చుక్కాపూర్‌లో మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం కేశంపేట, తలకొండపల్లి మండలాల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మండల పరిషత్‌లో వనమహోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో 50 ఎకరాల వరకు పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టేలా చూడాలన్నారు. ఎంపీడీవోలు శ్రీకాంత్, చంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రాయికుంట కట్ట మైసమ్మ బోనాలు



బోనమెత్తిన చిన్నారి

తాండూరు, జూలై 23: తాండూరు పట్టణం సాయిపూర్‌లోని రాయికుంట కట్ట మైసమ్మ దేవలయ పునర్నిర్మాణ పూజలతో పాటు ఆషాడ మాస బోనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప నర్సింహులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాండూరు ఆస్పత్రి తనిఖీ



తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కాయకల్ప బృందం

తాండూరు, జూలై 23: వైద్యవిధాన పరిషత్‌కు చెందిన కాయకల్ప బృందం డాక్టర్ దశరథ ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు జిల్లా జనరల్ ఆస్పత్రిని, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాయకల్ప కింద అవార్డు ఎంపికకు గానూ ఈ బృందం అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించింది. రోగులకు అందిస్తున్న సేవలు శానిటేషన్ వంటి అంశాలను పరిశీలించి వైద్యవిధాన పరిషత్‌కు నివేదిక అందజేయనుంది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి, వైద్యులు డాక్టర్ రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



కులకచర్ల: విఠలాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



షాబాద్: తిమ్మారెడ్డిగూడలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

కులకచర్ల, జూలై 23: రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. చౌడాపూర్ మండలంలోని విఠలాపూర్ గ్రామంలో మంగళవారం రైతులు సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను సర్వే నెంబరు ఆధారంగా పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల దగ్గర పంటల వివరాలను నమోదు చేయించాలన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి తగిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పత్తిపంటలో చీడపీడల నివారణకు యాజమాన్యం పద్ధతులపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ మాట్లాడుతూ.. రైతులకు రునహాఫీ, రైతు బీమా పథకాల గురించి వివరించారు. వర్షాకాలం సీజన్‌లో సాగు చేసే పంటల్లో తీసుకోవాల్సిన యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

మాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలి

షాబాద్, జూలై 23 : రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొదటి విడత రుణమాఫీ అయిన తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, ముద్దెంగూడ, వెంకమ్మగూడ గ్రామాల రైతులు ఎర్రోళ్ల అనిత, ప్రకాష్, కిష్టయ్య, గుత్తి గోపాల్, సిద్ధాపురం కమలమ్మ, రాజు, కూర పాండు, కూర సత్తయ్యలను వివరాలు అడిగారు. డీఏవో మాట్లాడుతూ.. రుణమాఫీతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. రుణమాఫీ చేయడంతో లోన్ బ్యాలెన్స్ జీరో అయ్యిందని, ఇప్పుడు కొత్తగా రుణం తీసుకొని సాగు పనులకు వాడుకుంటామని రైతులు చెప్పారన్నారు. నాగర్‌గూడ ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడి రుణమాఫీ అయిన రైతులకు లోన్ రెన్యూవల్ చేయాలని సూచించారు. డీఏవో వెంట ఏవో వెంకటేశం, ఏఈవోలు గీత, రాజేశ్వరి, రైతులు ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

కూరగాయలు, పట్టుపురుగుల పెంపకంతో ఆర్థిక ఇబ్బందులు తీరుతాయి



చౌదర్‌పల్లిలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న నీరజాగాంధీ

యాచారం, జూలై 23: తక్కువ పొలంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడంపై రైతులు ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజాగాంధీ రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులతో పంటల సాగు చేయడంపై రైతులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం యాచారం మండలం చౌదర్‌పల్లిలో కూరగాయల సాగు, పట్టు పురుగుల పెంపకం. ఆయిల్‌పాం తదితర పంటల సాగుపై వారు రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రైతు రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడి పంటల ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడితే పంట ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. కాయ కాండం తొలిచే పురుగుల నివారణకు వేపనూనె లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పట్టు పురుగుల పెంపకంపై రైతలు అవగాహన పెంచుకోవాలన్నారు. పట్టుపురుగుల పెంపకంతో లాభాలు గడించడం చాలా సులువన్నారు. నేడు మార్కెట్లో పట్టు వస్త్రాలపై జనం ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని, దాంతో పట్టుకు మంచి డిమాండ్ ఉందన్నారు. మల్బరీ తోటల పెంపకం ఈ ప్రాంతంలో లేకపోవడం బాధాకరమన్నారు. నేడు మార్కెట్లో టమాట, వంకాయ చిక్కుడు, గోరుచిక్కుడు, బీట్‌రూట్., క్యాబేజీ తదితర కూరగాయల సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ వినోద్‌కుమార్, రాఘవేందర్. ఉద్యానవన శాఖ డివిజనల్ అధికారి కనకలక్ష్మి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆమనగల్లు, జూలై 23: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ఆమనగల్లు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఆమనగల్లులో నిరసన చేపట్టారు. విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్, విద్యార్థులు తహసీల్దార్ లలితకు అందజేశారు. సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, అర్జున్, నితిన్, పవన్, రామ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైవే జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లకు ఎన్‌హెచ్‌ఏఐ సుముఖత

కొత్తూర్, జూలై 23: ప్రమాదాల నివారణకు 44వ నంబర్ జాతీయ రహదారిపై జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ సుముఖత వ్యక్తం చేసింది. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్, నందిగామ జంక్షన్ల వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత నెల 24న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయంలో అధికారులకు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు స్పందిస్తూ ఎమ్మెల్యేకు మంగళవారం లేఖ పంపారు. హైదరాబాద్-కర్నూల్ 44వ జాతీయ రహదారి 6లేన్ల విస్తరణ ఫేస్-1, ఫేస్-2లో భాగంగా కొత్తూర్ వై జంక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్, నందిగామ జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి కృషిచేసిన ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు.

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి

రాచకొండ పోలీసుల వినూత్న ప్రయోగం.. టెక్నాలజీకి పెద్దపీట



స్కాన్ చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 23: ప్రజా రక్షణ.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా.. పోలీస్ అధికారులు ప్రజలకు చేరువై.. మరిన్ని సేవలందించేందుకు కృషిచేయాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ట్రెండ్ నడుస్తుండటంతో.. ప్రజలతో మమేకమై పాలనలో భాగస్వాములను చేయాలని సీపీ సంకల్పించారు. ఐటీ సెల్ ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను నగరంలోని నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో మంగళవారం సీపీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాచకొండ పోలీస్ సోషల్ మీడియా ఖాతాలైన ఫేస్‌బుక్, ఎక్స్(ట్విటర్), ఇన్‌స్టాలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టేషన్ల రిసెప్షన్లలో ఏర్పాటు చేసిన ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను స్కాచ్ చేసి పోలీసుల సోషల్‌మీడియాను ఫాలో అవ్వడం, యూ ట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ఇతర సమాచారానికి రాచకొండ పోలీస్ వాట్సాప్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712662111కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్‌కుమార్, సునీతారెడ్డి, ఉషావిశ్వనాథ్, అరవింద్‌బాబు, కరుణాకర్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

తెలుగులో హెల్త్‌కేర్ అప్లికేషన్లు

డీప్ లెర్నింగ్‌తో అనువాదం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వింగ్ కమాండర్ శ్రీనివాస్

మేడ్చల్ టౌన్, జూలై 23: హెల్త్‌కేర్ అప్లికేషన్లు ఇకపై డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ద్వారా తెలుగు భాషలో అనువదించవచ్చు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐసీటీఈ వాణి వారు నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సును డైరెక్టర్ మిల్‌స్టార్ ఆర్ఎఫ్. అండ్ మైక్రోవేవ్ సిస్టిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, వింగ్ కమాండర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల భాషలోని ఆరోగ్య సంబంధిత అప్లికేషన్లను మాతృ భాష అయిన తెలుగులో ప్రతీ అక్కరు సులభంగా అర్థం చేసుకునే విధానాన్ని కనుగొనటం ఒక గొప్ప ఆవిష్కరణతో సమానమన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా వుండటానికి అనేక అప్లికేషన్లు వాడుతున్నారన్నారు. కాగా అప్లికేషన్లు ఆంగ్ల భాషలో ఉండటంతో వాటిని వినియోగించుకోవటం అందరికీ సాధ్యపడటం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య పరమైన విషయాలు తెలుగులో ప్రతీ సామాన్యుడు అర్థం చేసుకునే విధాన ఆవిష్కరణకు లర్నింగ్ టెక్నాలజీ ఎంతగానో దోహద పడుతుందన్నారు. డీప్ లెర్నింగ్ టెక్నాలజీని మరింత అభివృద్ధి పరచడానికి నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేయడం కళాశాల నైపుణ్యానికి నిదర్శనమన్నారు. సీఎస్ఐ సభ్యురాలు రమ ఎస్.పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆధునిక యుగంలో అన్నిరకాల సమస్యలు టెక్నాలజీ ద్వారా పరిష్కారించబడుతున్నాయన్నారు. ప్రతీరంగంలో కొత్త టెక్నాలజీల ఆవిష్కరణలు సమాజాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్తున్నాయన్నారు. హెల్త్ అప్లికేషన్ల ద్వారా ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని రోగాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. హెల్త్ అప్లికేషన్‌లో స్కిల్స్‌ను నర్సింహారెడ్డి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మరింత అభివృద్ధి చేసి ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఏఐసీటీఈ విణి ప్రయోజిత సదస్సు కోసం సుమారు 100కళాశాలలు పోటీ పడగా ఆ అవకాశం మాత్రం తమ కళాశాలకు లభించిందని కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి అన్నారు. డీప్ లెర్నిగ్ టెక్నాలజీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.లోకనాథం, ట్రెజరర్ త్రిలోకొరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఏ.మోహన్, కోఆర్డినేటర్ డీన్ డాక్టర్ దిలీప్‌కుమారొరెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ రాము, డాక్టర్ రామసుబ్బారెడ్డి, లక్ష్మి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



నల్లబెల్లం తరలిస్తూ పట్టుబడ్డ ముద్దాయిలతో ఎక్సైజ్ పోలీసులు

భారీగా నల్లబెల్లం పట్టివేత

పెద్దేముల్, జూలై 23: మండలంలోని ఓంమ్లానాయక్‌తండా శివారులో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ గౌడ్, టీడీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమర్‌లు మంగళవారం పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసు సిబ్బందితో మాటు వేసి ఒంమ్లానాయక్‌తండా వద్ద నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాన్‌లో పరిశీలించగా 5180కిలోల నల్లబెల్లం ఉంది. ఈబెల్లం కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. నల్లబెల్లం తరలిస్తున్న రాథోడ్ పాండునాయక్, రాథోడ్ ఓంసింగ్, రాథోడ్ సచిన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా సారా తయారు చేసే వారికి కిలో రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. పట్టుబడిన నల్లబెల్లం సుమారు రూ.4లక్షల మేర ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పాండుపై ఇలాంటి పలు కేసులు గతంలో కూడా నమోదై ఉన్నాయని చెప్పారు. బెల్లంతో పాటు బెల్లం రవాణాకు వాడిన వాహనాన్ని అదుపులోకి తీసుకుని ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు సీఐ గంగాధర్, సిబ్బంది విష్ణు, హన్మంతు, శివ, రవికుమార్ పాల్గొన్నారని తెలిపారు. టీడీఎఫ్ బృందాన్ని ఎక్సైజ్ కమిషన్ ఇ.శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ దశరథ్ వారిని అభినందించారు.

లంచం కేసులో మరొకరి అరెస్టు

కీసర రూరల్, జూలై 23: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఏసీబీకి పట్టుబడిన కేసులో మంగళవారం మరో అధికారిని ఆ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. స్టే వేకేట్ చేసే అంశంలో డబ్బులు డిమాండ్ చేస్తూ కమిషనర్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పాత్రధారి దమ్మాయిగూడ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డినీ ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పార్టనర్‌తో తలెత్తిన గోడ వివాదాన్ని పరిష్కరించేందుకు సుదర్శన్ ముందుగా మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను సంప్రదించారు. అతడి సమస్య పరిష్కారంలో భాగంగా స్టే వేకేట్ చేసేందుకు కేసు ఫైల్ చేసే విషయంలో సుదర్శన్‌తో రాజమల్లయ్య రూ.50వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య సూచన మేరకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డిని కలిశారు. కేసు ఫైల్ చేసేందుకు అతనూ డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన వాదించాల్సిన బాధ్యత ఉన్న మీరు డబ్బులు డిమాండ్ చేయడమేంటని సుదర్శన్ రామిరెడ్డిని ప్రశ్నించారు. అయినప్పటికీ రామిరెడ్డి మొండికేయటంతో అతడితో రూ.40వేలకు ఒప్పదం కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా రెండు దఫాలుగా అతడికి కొంత నగదు అప్పగించాడు. ఆ సమయంలో వీడియో రికార్డింగ్ చేసి పెట్టుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించారు. అందులో భాగంగానే ఏసీబీ అధికారులు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. అదే విధంగా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్న రామిరెడ్డిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేశారు. రామిరెడ్డిపై కేసు నమోదు చేయటం పట్ల అతడి తరపున పలువురు న్యాయవాదులు ఏసీబీ అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నట్లు సమాచారం. అతడి సంబంధం లేకుండా కేసు ఎలా నమోదు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకుంటున్నట్లు ఉన్న ఆధారాలను చూపడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. కాగా మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ కమిషనర్ నివాసంలోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా టీపీవో శ్రీధర్‌ను విచారించారు.

మోడల్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

భూసార పరీక్షల అంశంలో ప్రథమ బహుమతి



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

చేవెళ్ల, జూలై 23: భూసార పరీక్షల ఐడియా విన్నర్‌గా రాష్ట్రస్థాయిలో చేవెళ్ల మోడల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం సికింద్రాబాద్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి అంకురం బిజినెస్ ఇన్నోవేటర్ ప్రోగ్రాం ప్రాజెక్టు ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 జూనియర్ కాలేజీల విద్యార్థులకు మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి విభాగంలో రాష్ట్ర స్థాయిలో చేవెళ్ల మోడల్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. భూసార సాగు పరీక్షలతో రైతులకు కలిగే లాభాలపై విద్యార్థులు వివరించి భూసార పరీక్షలు చేసి చూపారు. నిర్వాహకుల విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ టేనావతి అభినందించారు.

జేపీ దర్గా వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు



ప్రారంభమైన డ్రైనేజీ పనులు

కొత్తూర్, జూలై 23: జేపీ దర్గా పరిసరాల్లో భూగర్భ మురుగునీటి కాలువలే లేక వర్షాకాలంలో దర్గా లోపలి వరకు వర్షపు నీరు వస్తోంది. భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను రాష్ట్ర వక్ఫ్ బోర్డు పట్టించుకోవడం లేదని ఆరోపణలొచ్చాయి. ఇటీవల దర్గాకు వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు స్పందించి మంగళవారం డ్రైనేజీ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా దర్గా వాసులు ఎమ్మెల్యేకు శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం ప్రియులకు అడ్డాగా జీపీ ఆఫీసు

చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



పంచాయతీ ఆవరణలో మద్యం బాటిళ్లు

చౌదరిగూడ, జూలై 23: పంచాయతీ కార్యాలయాలను మద్యం ప్రియులు అడ్డాగా చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతుండడంతో కొందరు ఆఫీసులోనే మద్యం తాగుతూ అసాంఘిక చర్యలకు దిగుతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం మద్యం సీసాలు కన్పించాయి. పంచాయతీ భవనాన్ని మందుబాబులు పర్మిట్ రూమ్‌గా మార్చారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంపీవో విజయ్‌కుమార్ పాల్ స్పందిస్తూ పంచాయతీ భవనానికి తాళం వేసి వెళ్లిన తర్వాత ఎవరో వచ్చి మద్యం తాగారన్నారు. పంచాయతీ భవవం వద్ద అసాంఘిక కార్యకలాపాల నివారణకు కార్యదర్శి ధీరజ్‌తో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్టు తెలిపారు.

సంజయ్‌గౌడ్‌కు ఇన్‌చార్జి పదవి



బషీరాబాద్, జూలై 23: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ యువకుడు సంజయ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపకులు డాక్టర్. పిడమర్తి రవి మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ గౌడ్ మట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధనకు ఏర్పడిన ఉద్యమకారులకు ఇవ్వాలనే ఆశయంతో సంఘం ఆధ్వర్యంలో ముందుకెళ్తామన్నారు.

సేద్యంలో మెళకువలు పాటించాలి

ఆమనగల్లు, జూలై 23 : పంటల సాగులో రైతులు తగు మెళకువలు పాటించాలని ఆమనగల్లు ఏవో అరుణకుమారి అన్నారు. ఆధునిక సేద్యం రైతులకు అన్ని విధాలా లాభదాయకమని పేర్కొన్నారు. రాంనుంతలలో మంగళవారం ఏవో పర్యటించారు. రైతుల సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి పంటలను ఆమె పరిశీలించారు. వరిలో నారుమడిలో గుళికల ప్రయోజనం గురించి రైతులకు వివరించారు. వరి నాడుమడిలో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలను ఎకరా నారుమడికి రెండుకిలోల చొప్పున చల్లితే 45రోజుల వరకు కాండం తొలుచు పురుగును అరికట్టవచ్చని తెలిపారు. వరి నాటే ముందు కొనలు తుంచి నాటితే కాండం తొలుచు పురుగు గుడ్లను నివారించవచ్చని రైతులకు తెలిపారు. ముసురు వర్షాల నేపథ్యంలో పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు శంకర్, సక్రు, జోలి, పిప్లి ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

ప్రతీ కుటుంబానికి అంగన్‌వాడీ సేవలు


కుర్మిద్దలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మాట్లాడుతున్న సీడీపీవో శాంతిశ్రీ

యాచారం/ఆమనగల్లు, జూలై 23 : ప్రతి ఒక్కరు రెండేళ్లు నిండిన చిన్నారులందరినీ విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. మంగళవారం యాచారం మండలం కుర్మిద్దలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్న ప్రతీ కుటుంబానికి అంగన్‌వాడీ కేంద్రాల సేవలను అందజేస్తామన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పేద కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతోందని తెలిపారు. అలాగే గతంలో గుండె సంబంధ వ్యాధితో బాధుతున్న సహస్ర అనే బాలికకు నిమ్స్‌లో ఆపరేషన్ చేయించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై సీడీపీవో తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తులసి, అరుణ, టీచర్లు ప్రవీణ, సుల్తానా ఉన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి హాజరయ్యారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మూడేళ్ల పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో ఆట పాటలతో కూడిన బోధన ఉంటుందన్నారు. పౌష్టికాహారం పెడతామన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శబరి, సరళ, తిరుమళ, పద్మ, కవిత, బాలమణి, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, రాజ్యలక్ష్మి, రజిత, నాగమణి, లక్ష్మి, స్వరూప, తబిత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

● కేంద్ర బడ్జెట్‌పై పలువురి అసంతృప్తి


శ్రీనివాస‌గౌడ్, పీసీసీ సభ్యుడు

ఆమనగల్లు, జూలై 23 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు మంత్రులున్నా తెలంగాణకు నిధులు రాబట్టలేదన్నారు. ఏపీ, బిహార్ రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులున్నాయని వ్యాఖ్యానించారు. 17 మంది లోక్‌సభ సభ్యులున్న తెలంగాణకు బడ్జెట్‌లో మొండిచేయి చూపడం బీజేపీ పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఏపీతో పాటు తెలంగాణ కూడా ఉందన్నారు. బీజేపీకి గతంలో నలుగురు ఎంపీలు ఉంటే ఇప్పుడు 8 మంది ఉన్నా సాధించిందేమీ లేదని విమర్శించారు.

పదేళ్లుగా రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి



కందుకూరు: కేంద్ర బడ్జెట్‌లో పదేళ్లుగా రాష్ట్రానికి నిధులు కేటాయించడం లేదు. 8 మంది బీజేపీ ఎంపీలనె గెలిపించిన రాష్ట్రంలో ఈసారైనా నిధు లు వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలి ంది. దీనిపై రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, మంత్రు లు నోరుమెదపకపోవడం సిగ్గుచేటు.

\- ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు

ప్రభుత్వాన్ని కాపాడుకునేలా కేంద్ర బడ్జెట్



కడ్తాల్: రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీల అసమర్థత మూలంగానే బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. నిధుల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేలేదు. ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్లు ఉంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే ఈ రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేశారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ అనే పదమే ప్రస్తావించలేదు. పాలమూరు-రంగారెడ్డి జిల్లా జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరం.

\- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి

రైతులు, నిరుపేదలకు కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట



కందుకూరు, జూలై 23: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, నిరుపేదలు, మహిళలు, యువతకు పెద్దపీట వేశారని బీజేపీ జిల్లా పంచాయతీరాజ్ సెల్ మాజీ కన్వీనర్ సాధ మల్లారెడ్డి అన్నారు. గ్రామీణాభివృద్ధికి రూ.2.66లక్షల కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా ఉందని అన్నారు.

పలు గ్రామాల్లో బోరు మోటర్ల ప్రారంభం


ఉత్తరాస్‌పల్లిలో బోరు మోటారును ప్రారంభించిన నాయకులు

కొందుర్గు, జూలై, 23 : మండల పరిధి ఉత్తరాస్‌పల్లి, ముట్పూర్ గ్రామాల్లో మంగళవారం బోరు మోటర్లను నాయకులు ప్రారంభించారు. ఉత్తరాస్‌పల్లిలోని ఎల్లమ్మ గుడి పక్కనున్న వీధిలో తాగునీటి సమస్య ఉందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకుపోయారు. ఎమ్మెల్యే నిధులు 50వేలతో బోరుకు సింగిల్ ఫేజ్ మోటరును ఏర్పాటు చేయించారు. అలాగే ముట్పూర్ పాఠశాలలో విద్యార్థులకు తాగునీరందించేందుకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడి సొంత డబ్బుతో ఇటీవల వేయించిన బోరుకు సింగిల్ ఫేజ్ మోటర్‌ను నాయకులు బిగించారు. కార్యక్రమాల్లో అంజిరెడ్డి, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, వేణు, సందీప్, నర్సింలుగౌడ్, రాజు, శ్రీకాంత్, సాయిలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


సూపరింటెండెంట్ శారద

షాబాద్, జూలై 23 : ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని షాబాద్ నూతన సూపరిండెంట్ జి.శారద అన్నారు. మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ అయ్యారు. ఫరూఖ్‌నగర్ సూపరిండెంట్‌గా విధులు నిర్వహించిన శారద షాబాద్‌కు బదిలీపై వచ్చారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

షాబాద్, జూలై 23: కురుస్తున్న వర్షాలకు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పోతుగల్ పంచాయితీ కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. పోతుగల్ తండాలో మంగళవారం పర్యటించి శిథిలావస్థకు చేరిన ఇండ్లలోంచి ప్రజల సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఆశ్రయం కోసం పంచాయతీ కార్యాలయంలో వచ్చి ఉండాలని తండా వాసులకు సూచించారు.

సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు తీసుకున్న రవీందర్, రమేశ్

చేవెళ్ల, జూలై 23: ఉద్యోగుల బదిలీల్లో భాగంగా చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయానికి నూతనంగా ఇద్దరు అధికారులు వచ్చారు. మండల పరిషత్ నూతన సూపరింటెండెంట్‌గా వి.రవీందర్, సీనియర్ అసిస్టెంట్‌గా రమేశ్ మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి

శంషాబాద్, జూలై 23 : శంషాబాద్‌లోని పోచమ్మగడ్డ పోచమ్మతల్లి, మధురానగర్‌లోని పోచమ్మ ఆలయాల నిర్వాహకులు సోమవారం రాత్రి పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్, మాజీ సర్పంచ్ గణేష్, డి.వెంకటేశ్‌గౌడ్, సిద్దులుగౌడ్ పాల్గొన్నారు. మధురానగర్ బస్తీలో నాయకుడు ప్రసాద్ కుటుంబం ఆధ్వర్యంలో బండి ఊరేగింపు నిర్వహించారు. బస్తీకి పలువురు పాల్గొన్నారు.

బుల్కాపూర్‌లో బోనాల పండుగ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి బుల్కాపూర్‌లో బోనాల పండుగ ఘనంగా జరిగింది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కాళిక మాతకు పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఆషాడ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంరెడ్డి, పాండురంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్ ఉన్నారు.


బుల్కాపూర్ ఆలయంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్లు లక్ష్మమ్మ, శ్వేత తదితరులు

రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో రేణుక ఎల్లమ్మ కల్యాణాన్ని నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. వేద మంత్రాల మధ్య జరిగిన కల్యాణంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్ గుప్తా, నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్, అంజయ్య, జగన్, యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

షాబాద్: మండల పరిధి చందన్‌వెళ్లిలో కట్టమైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో చేవెళ్ల స్వామి, యాదయ్య, మహేందర్, దయాకర్ రెడ్డి, శివ, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.


మొగిలిగిద్దలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖర్గేను కలిసిన జ్యోతి భీంభరత్



షాబాద్, జూలై 23 : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పామెన భీం జ్యోతి మంగళవారం ఢిల్లీలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఖర్గే సూచించినట్లు జ్యోతి తెలిపారు. కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయన్నారు. ఆమెతో శంకర్‌పల్లి మన్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పదు


ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి

కొత్తూర్: జూలై 23: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పదని, బదిలీలు సర్వసాధారణమని కొత్తూర్ మాజీ ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మక్తగూడ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్తున్న మేకలరెడ్డిని పాఠశాల ఆవరణలో సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ హెచ్‌ఎంను శాలువాలతో సన్మానించారు. ఆయన ఎంపీపీ మాట్లాడుతూ మేకలరెడ్డి విద్యాభివృద్ధి చేసిన కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, నాయకులు రాందాస్‌నాయక్, దయానంద్‌గుప్తా, దర్శన్, రాములుగౌడ్, రాజు, శ్రీరాములు, రాజు, శేఖర్, భరత్‌రెడ్డి, శ్రీశైలం, అంజి, శ్రీను, నర్సింహ పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి

శంషాబాద్/మాడ్గుల/చేవెళ్ల, జూలై 23: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. కార్మికులతో శంషాబాద్‌లో మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. పర్వతాలు మట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ఈ మహాధర్నాలో భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, కార్యదర్శి ఎన్.గిరి, ఏఐటీయూసీ నాయకులు ప్రభు, స్వామి, కార్మికులు పాల్గొన్నారు. భవణ నిర్మాణ రంగ కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. మాడ్గులలో ఆయన మాట్లాడారు. 26న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అడ్డమీద లేబర్ ఇబ్బందులు పడుతున్నారని, వారికి షెడ్లను నిర్మించి నీటి వసతి కల్పించాలన్నారు. 26న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, ప్రధాన కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి పిలుపునిచ్చారు. వారు నిర్మాణ రంగ కార్మికులతో వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు 'చలో అసెంబ్లీ'ని తలపెట్టామన్నారు. పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని సూచించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల, శివ, కార్మికులు ఉన్నారు.

'రోడ్ల అభివృద్ధికి నిధులివ్వాలి'

మంచాల, జూలై 23 : రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్‌రెడ్డి రాంరెడ్డిని మంచాల మండల చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో ఇచ్చారు. ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, చీదేడ్ మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మాసయ్యగౌడ్, రాజు, సురేష్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆమనగల్లు, జూలై 23 : ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ వద్ద బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి లక్యానాయక్, ఉపాధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, మిల్లు కార్మికులు పాల్గొన్నారు. జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. దేశసేవతో పాటు కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శంకర్, సభ్యులు చందర్, పంతు, మల్లిక్, రాజు, అలివేలు, విజయ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారావు, అప్పారెడ్డి ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఎంఎస్ జెండా ఆవిష్కరిస్తున్న యాదయ్య, లక్యానాయక్

పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి


నిరంజన్‌రెడ్డికి అవకాడ మొక్కను అందజేస్తున్న రైతు

కందుకూరు, జూలై 23 : పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దెబ్బడగూడలో జైపాల్ నాయక్ సాగుచేస్తున్న అవకాడ తోటను ఆయన పరిశీలించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగుపై శ్రద్ధ చూపుతారని, అలాగే పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జైపాల్‌నాయక్ అవకాడ తోటను పెంచేందుకు ముందుకు రావడంపై అభినందించారు. 250మొక్కలు నాటానని రైతు మాజీ మంత్రికి చెప్పాడు. గత సంవత్సరం కిలోకి 200కు, ఈ సారి కిలో 300 చొప్పున తోట వద్దనే అమ్మానని తెలిపాడు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం

శంషాబాద్ రూరల్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం శంషాబాద్‌లోని పెన్షన్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో ఆర్థిక నివేదికను చదివారు. సమస్యలపై చర్చించారు. సంఘం అభివృద్ధిపై సలహాలు, సూచనలు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, శంకర్‌రెడ్డి, జగదీశ్వర్, తీలేశ్వరయ్య పాల్గొన్నారు.


కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

రాజ్యాధికార సాధనకు సంఘటితం కావాలి


ఐక్యతను ప్రదర్శిస్తున్న గిరిజన నేతలు

కడ్తాల్, జూలై 23: హక్కుల పరిరక్షణ, రాజ్యాధికారం సాధనకు గిరిజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్ పిలుపునిచ్చారు. కడ్తాలలోని ఎంబీఏ గార్డెన్‌లో మంగళవారం సేవాలాల్ సేన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధనకు సేవాలాల్ సేన రాజీలేని పోరాటాలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. తీజ్, సీత్లా పండుగలకు ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వి.నరేశ్‌నాయక్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కో-కన్వీనర్ రఘురామ్‌రాథోడ్, రేఖ్యానా యక్, బీమ్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిషన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ జగ్జీవన్‌రామ్ భవనంలో నిర్వహించే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ విజయవంతంపై చర్చించారు. నాయకులు సభావట్ బిచ్యానాయక్, హీరాసింగ్, లక్‌పతినాయక్, జగన్‌నాయక్, శ్రీను నాయక్, బలరామ్ నాయక్, నరేశ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రవినాయక్, మోతీలాల్ నాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పునకు విద్య గొప్ప ఆయుధం

కడ్తాల్, జూలై 23: విద్యతోనే ప్రగతి, సమాజంలో మార్పు సాధ్యమని మాజీ జడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరారు. కడ్తాలలో మంగళవారం జేఈఈ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో ఎస్టీ కేటగిరిలో 391వ ర్యాంక్ సాధించిన వెలుగురాళ్ల తండాకు చెందిన మారుతికుమార్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతికుమార్‌ను దశరథ్ సత్కరించారు. తన ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు అందజేశారు. చదువుకు పేదరికం అడ్డు కాదన్నారు. మారుతి ఉన్నత చదువు అభ్యసించేందుకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, శ్రీను, కృష్ణ, శ్రీను, చందర్, వెంకటేశ్, రతన్, గణేశ్, రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మారుతికుమార్‌ను సన్మానిస్తున్న దశరథ్‌నాయక్, పాల్గొన్న నాయకులు

సంక్షిప్తంగా...

● **శంషాబాద్ రూరల్:** శంషాబాద్ మండలం పిల్లోనిగూడకు చెందిన యాదయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని తెలిపారు.

● **కొందుర్గు:** రైతు బీమా పథకానికి అర్హులైన రైతులు వచ్చే నెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల ఏవో శిరీష తెలిపారు. కొత్త పాస్‌బుక్ వచ్చిన వారు, గతంలో దరఖాస్తులు చేసుకోని రైతులు దరఖాస్తులను కొందుర్గు, ముట్పూర్, మహాదేవ్‌పూర్, ఆగిర్యాల క్లస్టర్స్ వారిగా ఏఈవోలకు అందజేయాలని సూచించారు. రైతు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

● **తలకొండపల్లి:** లింగరావుపల్లికి చెందిన పోచమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు, కేశవరెడ్డి రూ.2,500 ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, చంద్రయ్య, జంగయ్య, కృష్ణయ్య, చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

● **కేశంపేట:** కాకునూర్‌కు చెందిన ఇంజమూరి చిన్న అంజమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మాజీ జడ్పీటీసీ టి.విశాలశ్రవణ్‌రెడ్డి రూ.5వేలు, కాకునూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.8వేలను మృతురాలి కుటుంబీకులకు అందించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, పర్వతాలు, రాములు, శ్రీశైలం, నరేందర్‌రెడ్డి, నర్సింలు, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● **కడ్తాల్:** ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తికి ప్రజలు సహకరించాలని కడ్తాల పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సుజాత కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, వీధి లైట్ల ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులపై ప్రజలు తెలిపారు. గ్రామసభలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహా, నాయకులు జహంగీర్‌బాబా, పీఎస్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

● **షాద్‌నగర్ అర్బన్:** షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీనగర్‌కాలనీ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జమాల్‌పూర్ చందులాల్, ప్రధాన కార్యదర్శిగా చౌలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, న్యాయ సలహాదారుడిగా శ్యాంసుందర్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, కాలనీ వాసులు సన్మానించి, అభినందించారు.

● **శంషాబాద్ రూరల్:** మండలంలోని పెద్దతుప్రకు చెందిన శ్రీనలోల్ల యాదయ్య బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడం సంతోషకరంగా ఉందన్నారు. పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. బీజేపీ జిల్లా నాయకులు బంటు జ్ఞానేశ్వర్‌కు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

● **షాద్‌నగర్ అర్బన్:** ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశాన్ని బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ తెలిపారు. ఎల్బీనగర్ కొత్తపేటలోని కమర్షియల్ ట్యాక్స్‌కాలనీ కమిటీ హాల్లో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

క్రైం కార్నర్

గంజాయి బ్యాచ్‌ను పట్టించిన స్థానికులు


గాంజా బ్యాచ్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

శంషాబాద్ రూరల్, జూలై 23: గంజాయి తాగుతున్న కొందరిని స్థానికులు పోలీసులకు పట్టించిన ఘటన మంగళవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు... సిద్ధాంతి కాలనీలో ఏడుగురు యువకులు గంజాయి సేవిస్తూ కాలనీవాసులను ఇబ్బందులు పెడు తున్నారు. దీంతో స్థానికులు 100 కాల్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కాలనీలో ఉండే ఇసాక్ అనే యువకుడి ఇంట్లో కొత్వాల్‌గూడ, సిద్ధాంతి బస్తీకి చెందిన దీపక్, వంశీ, పవన్, మరో ముగ్గురు గాంజా తాగుతున్నట్లు పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు ఇసాక్, దీపక్, వంశీ, పవన్‌లను స్టేషన్‌కు తరలించారు. మరో ముగ్గురు పరారయ్యారు. ఈ యువకులు గాంజా, మద్యం తాగుతున్నారని స్థానికులు తెలిపారు. తమ విచారణలో యువకుల గంజాయి తాగినట్టు ఆనవాళ్లు లభించలేదని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. సిద్ధాంతిబస్తీకి చెందిన కుమార్ గాంజాకు బానిసై మహిళలను వేధించగా నాలుగైదు రోజుల క్రితం స్థానికులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. దీంతో అతడు మృతిచెందాడు. ఇదే బస్తీలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేశాడు. మంగళవారం గాంజా ముఠా పట్టుబడింది. ఇలాంటి వరుస ఘటనలతో కాలనీ వాసులు బెంబేలెత్తుతున్నారు. మహిళలకు, బాలికలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని, కాలనీలో పోలీసు గస్తీ పెంచాలని కోరుతున్నారు. కాలనీ వారిని ఇబ్బందులు పెడితే కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.